

పల్లె ప్రకృతి వనం




క్రీడా ప్రాంగణం

# ప్రగతిలో వాస్తాపూర్ పరుగులు

- ప్రత్యేక పంచాయతీతో గణనీయంగా అభివృద్ధి
- రూ.4.20 కోట్లతో బీటీ రోడ్డు
- పల్లె ప్రగతితో మారిన గ్రామ రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వాస్తాపూర్-తాండ్ర గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు

మామడ, అక్టోబర్ 22 : గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. సీఎం కేసీఆర్ గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా పాలనసాగిస్తున్నారు. మండలంలోని తాండ్ర గ్రామ పరిధిలోని వాస్తాపూర్ గతంలో అభివృద్ధికి ఆమాడ దూరం లో ఉండేది. స్వపరిపాలనలో భాగంగా 2018లో ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చింది. దీంతో వాస్తాపూర్ గ్రామ పంచాయతీ ఏర్పడింది. తాండ్ర పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్నప్పుడు గ్రామానికి వెళ్లడానికి రహదారి లేక అనేక ఇబ్బందులు పడేవారు. వాస్తాపూర్ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4.20 కోట్లతో చక్కని బీటీ రోడ్డు రోడ్డు నిర్మించింది. అంతేకాకుండా పల్లె ప్రగతి కార్యక్రమంతో ప్రస్తుతం ఈ గ్రామ రూపురేఖలు మారిపోయాయి. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పరిశుభ్రత,పచ్చదనం ప్రాధాన్యత ఇస్తున్నారు.



గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

**చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు..**

- తాండ్ర గ్రామం నుంచి వాస్తాపూర్ వరకు రూ.4.20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- రూ.12లక్షలతో హనుమాన్ ఆలయ నిర్మాణం
- సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20లక్షలు
- ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ ఏర్పాటుకు రూ.6.71లక్షలు
- సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి రూ.2.35 లక్షలు
- వైకుంఠధామం నిర్మాణానికి రూ.12.50 లక్షలు
- పల్లె ప్రకృతి వనం ఏర్పాటుకు రూ.50 వేలు
- రూ.92 వేలతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు

### గ్రామాభివృద్ధే ధ్యేయం..



గ్రామాలాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ నిధులు కేటాయిస్తున్నది. దీంతో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నా. గ్రామంలో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమస్య పరిష్కరిస్తున్నా. పల్లె ప్రకృతి వనం, డంప్ యార్డు, క్రీడా ప్రాంగణం నిర్మాణంతో గ్రామ రూపురేఖలు మారిపోయాయి. గ్రామస్తులు సైతం సహకరిస్తున్నారు.

**- ఆత్రం సంతోష్,సర్పంచ్(వాస్తాపూర్)**

### రోడ్డు నిర్మించడం సంతోషం..



మా గ్రామానికి తాండ్ర గ్రామం నుంచి దాదాపు 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు సౌకర్యం కల్పించడం చాలా సంతోషంగా ఉంది. గతంలో మా గ్రామానికి రోడ్డు లేక ఇబ్బందులు పడ్డాం. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం నిర్మల్ దవాఖానకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం రూ.4.20 కోట్లతో ప్రభుత్వం రోడ్డు నిర్మించడంతో ప్రయాణం సులభమైంది.

**- తోడసం భీంరావు, వాస్తాపూర్**

# అల్లోలను భారీ మెజార్టీతో గెలిపించాలి



రాంసింగ్‌తండాలో మాట్లాడుతున్న నాయకులు

సారంగాపూర్, అక్టోబర్ 25 : అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని రాంసింగ్‌తండా, కుప్టి, పొట్యా గిరిజన గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలాభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళల కోసం కొత్త పథకాలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ నల్లావెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొత్తపెల్లి మాధవరావు, డీసీసీబీ డైరెక్టర్ అయిరా నారాయణరెడ్డి, సర్పంచ్ రాజేశ్, మార్కెట్ వైస్ చైర్మన్ దత్తురాం, ఎంపీటీసీ భోజారెడ్డి, నాయకులు రాజ్‌మహ్మద్, వంగ రవీందర్‌రెడ్డి, నారాయణనాయక్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



లక్ష్మణచాంద : మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో ప్రవీణ్ కుమార్

మామడ, అక్టోబర్ 25 : మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో గంగారాం పేర్కొ న్నారు. బుధవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2090 చొప్పున మద్దతు ధర అందిస్తున్నదన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సృజిత, సిబ్బంది గంగాధర్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

**లక్ష్మణచాందలో..**

లక్ష్మణచాంద, అక్టోబర్ 25 : మండల కేంద్రంలో మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రభుత్వం మక్కలు క్వింటాల్‌కు రూ. 2090 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఏఈవోలు సంతోష్, ఉమామహేశ్వరీ, పవిత్ర, ఉదయ్, సిబ్బంది రమణ, సాయి, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.



మామడలో..

# వైద్యుడికి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సన్మానం

భైంసా, అక్టోబర్ 25 : భైంసాలో 50 సంవత్సరాలుగా వైద్య సేవలందిస్తున్న డా. దామోదర్ రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పూలమాల శాలువాతో సత్కరించారు. కొన్ని సంవత్సరాలుగా ఎంతో మందికి పరీక్షలు చేసి వైద్యవృత్తికి వన్నె తెచ్చారని సూచించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణ, మురళీగౌడ్, తోట రాము, కాండ్లి సాయినాథ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

# నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

కుంటాల, అక్టోబర్ 25 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్ రెడ్డి గురువారం సూర్యపూర్ గ్రామం నుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారని బీఆర్ ఎస్ పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తు ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

# పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

సారంగాపూర్, అక్టోబర్ 25 : స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలలో జరిగిన కేసుల వివ రాలను అడిగి తెలుసుకొని తగిన సూచనలు, సల హాలు అందించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

# బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ

లక్ష్మణచాంద, అక్టోబర్ 25 : మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికురాలు గంగవ్వ బుధవారం అనారోగ్యంతో మరణించారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి పరామర్శించారు,. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్ తదితరులు ఉన్నారు.